చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి నిధులు మంజూరు



ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, జనవరి 9 : చేర్యాల మండలంలోని కొత్త దొమ్మాట, ధూళిమిట్ట మండలంలోని లింగాపూర్ దగ్గర చెక్ డ్యామ్‌లు నిర్మాణానికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రత్యేక కృషి చేసి రూ.7.6 కోట్లు నిధులను మంజూరు చేయించారు. కొత్త దొమ్మాట, లింగాపూర్ గ్రామాల ప్రజల అభ్యర్థన మేరకు ఎమ్మెల్యే పల్లా కొత్త దొమ్మాట చెక్‌డ్యామ్ నిర్మాణానికి రూ.2.80 కోట్లు, ధూళిమిట్ట మండలంలోని లింగాపూర్‌లో చెక్ డ్యామ్ నిర్మాణానికి రూ.4.26 కోట్ల నిధులను మంజూరు చేయించారు. రూ.7కోట్ల పైచిలుకు నిధులు మంజూరు చేయించడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో ఉన్న వాగులపై చెక్ డ్యామ్‌లు నిర్మిస్తే వ్యవసాయ బోరుబావుల్లో జలమట్టం పెరిగి సాగు విస్తీర్ణం పెరగనుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి చేర్యాల, ధూళిమిట్ట మండలాల రైతులతో పాటు బీఆర్ఎస్ శ్రేణులు కృతజ్ఞతలు తెలిపాయి.

రైతులకు అందుబాటులో ఎరువులు

సొసైటీలో అందుబాటులో ఉన్న ఎరువులను చూపుతున్న ఏవో రామకృష్ణ

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 9 : మద్దూరు మండలంలోని రైతులకు అందుబాటులో ఎరువులను ఉంచినట్లు మద్దూరు మండల వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ యాసంగిలో 8530 ఎకరాలలో వరి సాగు కానున్నట్లు అంచనా వేసినట్లు తెలిపారు. మద్దూరు పీఏసీఎస్‌తో పాటు అగ్రోస్, ఏఆర్ఎస్‌కే మర్మాములలో రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. రాబోయే ఫిబ్రవరి నెలకు కూడా అదనంగా వంద మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

పీఎం కిసాన్ ఫిజికల్ వెరిఫికేషన్ పరిశీలన

జక్కాపూర్‌లో పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

నారాయణరావుపేట, జనవరి 9 : మండల కేంద్రమైన నారాయణరావుపేట్‌తో పాటు గుర్రాలగొంది, జక్కాపూర్ గ్రామాల్లోని రైతు వేదికల్లో జరుగుతున్న పీఎం కిసాన్ యోజన ఫిజికల్ వెరిఫికేషన్ నమోదును ఏడీఏ పద్మ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్నటు వంటి ఫిజికల్ వెరిఫికేషన్‌ను తమ యొక్క వ్యవసాయ విస్తరణ అధికారులకు దరఖాస్తులను అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో పరశురాంరెడ్డి, ఏఈవోలు వరుణ్, మానిక, స్పందన పాల్గొన్నారు.

స్పోర్ట్స్ దుస్తులు పంపిణీ

నర్మెటలో విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌లను అందజేస్తున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

నంగునూరు, జనవరి 9 : సేవా ధృక్పథంతో ఉండటం ఎంతో గొప్పదని జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని నర్మెట ప్రాథమిక పాఠశాలలో ప్రముఖ లోహిత్ సాయి దవాఖాన వైద్యులు, సురభి మల్టీ స్పెషాలిటీ దవాఖాన వైద్యుడు డాక్టర్ భాస్కర్ సహకారంతో విద్యార్థులకు రూ.30 వేలు విలువ చేసే స్పోర్ట్స్ దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్య ద్వారానే సమాజంలో ప్రతి ఒక్కరికీ ఆత్మగౌరవం పెరుగుతుందన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకొని ప్రతిభ కనబరిస్తే ఉన్నత స్థాయిలో రాణిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో దేశిరెడ్డి, డాక్టర్ భాస్కర్, పాఠశాల ఉపాధ్యాయుడు మనీష్ కుమార్, పంచాయితీ కార్యదర్శి సురేశ్ కుమార్, మాజీ సర్పంచ్‌లు అజిత్, శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ రాజిరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వం మోసం చేసిందని రైతుల నిరసన

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నారాయణరావుపేట, జనవరి 9 : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, మాజీ వైస్ ఎంపీపీ సంతోశ్ కుమార్ విమర్శించారు. గురువారం మండల కేంద్రమైన నారాయణరావుపేటలో రైతు నిరసన దీక్షలో భాగంగా మానవహారం నిర్వహించి తహసీల్‌లో ధర్నా నిర్వహించి రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం అధికారులు ప్రోటోకాలు ఉల్లంఘిస్తున్నారని ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. మాజీ ఎంపీపీ బాల కృష్ణ, నాయకుడు ఎల్లారెడ్డి, నేతలు ఉన్నారు.

మిరుదొడ్డిలో రేపు క్రికెట్ టోర్నీ ప్రారంభం

మాట్లాడుతున్న మొగుళ్ల ఐలయ్య,నేతలు

మిరుదొడ్డి, జనవరి 9 : గ్రామీణ ప్రాంతాల్లోని యువకులకు, విద్యార్థులకు క్రీడా నైపుణ్యాన్ని పొందించడానికి క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని క్రికెట్ టోర్నమెంట్ ఆర్గనైజర్, బీఆర్ఎస్ నాయకుడు మొగుళ్ల ఐలయ్య అన్నారు. గురువారం మిరుదొడ్డి టౌన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వామి వివేకానంద, సంక్రాంతి పండుగ పర్వదినాలను పురస్కరించుకొని మిరుదొడ్డిలో నెల 11వ తేదీ నుంచి 15వ తేదీవ వరకు ఉమ్మడి మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాలకు చెందిన క్రీడా కారులకు క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులకు మొదటి బహుమతి రూ. 11,111, ద్వితీయ బహుమతి రూ.5, 500, మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌కు రూ.2 వేలు నగదుతో పాటు సీల్డులు అందజేయనున్నారని పేర్కొన్నారు. రూ.555 ఎంట్రీ ఫీజు కట్టి జట్ల వివరాలను 10వ తేదీ వరకు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 86 86718387, 9948525027, 62 8101 8242 నెంబర్లను సంప్రదించాలని కోరారు. సమావేశంలో అర్గనైజర్ సభ్యులు కొండల్ రెడ్డి, చంద్ర కుమార్, స్వామి, హరి విష్ణు, కృష్ణ, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఓయూ రిజిస్ట్రార్‌ను కలిసిన అధ్యాపకులు

ఓయూ రిజిస్ట్రార్ నరేష్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రిన్సిపాల్

గజ్వేల్, జనవరి 9 : గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీకళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా రావడంపై గురువారం ఉస్మానియా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్ రెడ్డి, కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ లోని మల్టీ జోన్ టూ జాయింట్ డైరెక్టర్ రాజేందర్‌సింగ్, మల్టీ జోన్ వన్ జేడీ యాదగిరి, అకడమిక్ గైడెన్స్ అధికారి ప్రొఫెసర్ బాలభాస్కర్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖిత్ అంజుమ్, ఐక్యూసీ కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటేశ్, అకడమిక్ కో-ఆర్డినేటర్ కెప్టెన్ డాక్టర్ భవానీ కలిసి కృతజ్ఞతలు తెలిపారు. స్వయం ప్రతిపత్తి హోదా రావడానికి కృషి చేసినందుకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

ఎన్ఆర్‌జీఎస్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

కలెక్టర్ మనుచౌదరి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్,జనవరి 9 : ఎన్ఆర్‌జీఎస్ ద్వారా మంజూరైన పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ఎన్ఆర్‌జీఎస్ 15వ ఆర్థిక సంఘం ద్వారా వివిధ అభివృద్ధి పనుల కోసం చేపట్టిన పనులపై కలెక్టర్ మనుచౌదరి గురువారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్ఆర్‌జీఎస్ ద్వారా గ్రామపంచాయతీ, అంగన్ వాడీ, సీసీ రోడ్డు తదితర పనులు చేపట్టామని అందులో ఇప్పటి వరకు అనుమతులు పొందిన అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రారంభించిన నిర్మాణ పనులను ఈ ఆర్థిక సంవత్సరం చివరిలోగా పూర్తి చేయాలన్నారు. టెండర్ దశలో ఉన్న వాటిని త్వరగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి శారద, వైద్యారోగ్యశాఖ అధికారి పల్వన్ కుమార్,పంచాయతీ ఈఈ శ్రీనివాస్, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

క్యూఆర్‌కోడ్ సద్వినియోగం చేసుకోవాలి

సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ

వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ డాక్టర్ అనురాధ

సిద్దిపేట కలెక్టరేట్, జనవరి 9 : ఫిర్యాదు దారులు పోలీస్ స్టేషన్‌కు వచ్చి దరఖాస్తు ఇచ్చినప్పుడు వారికి అందుతున్న సేవల గురించి క్యూఆర్‌కోడ్ స్కాన్ చేసి ఫీడ్ బ్యాక్ ఇచ్చే అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సీపీ అన్నారు. పోలీస్ కమిషనర్‌లో గురువారం సీపీ డాక్టర్ అనురాధ చేతుల మీదుగా క్యూఆర్‌కోడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ క్యూఆర్‌కోడ్ ప్రతి పోలీస్ స్టేషన్‌లో, సర్కిల్ కార్యాలయాల్లో, ఏసీపీ ఆఫీస్‌లో పోలీస్ స్టేషన్ ముందు భాగంలో కనిపించే విధంగా ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు వారి అభిప్రాయాలు ఫీడ్ బ్యాక్ తెలియజేసే అంశాలు ఫిర్యాదులు, ఎఫ్ ఐఆర్, ఈ చాలన్ ట్రాఫిక్ ఉల్లంఘనలు, పాస్‌పోర్ట్ ధ్రువీకరణ, ఇతర అంశాలు తెలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ మధు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

బాధితుడికి సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న మహేశ్

కొమురవెల్లి, జనవరి 9 : సీఎం సహాయనిధి నిరుపేదలకు వరమని బీఆర్ఎస్ నాయకుడు ఏర్పుల మహేశ్ అన్నారు. మండలంలోని తపాస్‌పల్లికి చెందిన ఎల్ల రామచంద్రం కొన్ని రోజుల కింద అనారోగ్యంతో దవాఖానలో చికిత్స పొందగా, మంజూరైన రూ. 31,500 చెక్కును బాధితులకు గురువారం మహేశ్ అందజేశారు. ఆయన వెంట నేత సున్నం శ్రీనివాస్ ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రవాణా శాఖ అధికారి కొండల్‌రావు

హుస్నాబాద్, జనవరి 9 : ప్రతి వాహన దారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని జిల్లా రవాణా శాఖ అధికారి కొండల్‌రావు అన్నారు. గురువారం హుస్నాబాద్ పట్టణంలోని శ్రీసిద్ధార్థ హైస్కూల్‌లో రవాణా శాఖ, పోలీసు శాఖ ఆధ్వర్యంలో స్కూల్ బస్, డీసీఎం వ్యాన్ డ్రైవర్లకు రోడ్డు భద్రత-ప్రమాదాల నివారణపై జరిగిన అవగాహన సదస్సులో స్థానిక సీఐ శ్రీనివాస్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, ఫోర్ వీలర్ వాహనదారులు సీటుబెల్టును విధిగా ధరించాలని సూచించారు. ఎట్టి పరిస్థితులోనూ మద్యం సేవించి వాహనాలు నడుపొద్దన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం ఎంతో ప్రమాదకరమని సూచించారు. రోడ్డు ప్రమాదాలను అప్రమత్తతతోనే నివారించవచ్చని, ఇందుకు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలన్నారు. ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై తోట మహేశ్, ఏఎంవీఐ శ్రీకాంత్‌రెడ్డి, వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్లు నాగిడి నర్సింహారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, నారాయణరెడ్డి, రాజేందర్, విజయ్ కుమార్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు జైలు, జరిమానా

సిద్దిపేట టౌన్, జనవరి 9 : మద్యం తాగి వాహనాలను నడిపిన మందు బాబులకు సిద్దిపేట న్యాయస్థానం జైలు శిక్ష, జరిమానా విధిస్తూ గురువారం తీర్పును వెలువరించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్, వన్ టౌన్ సీఐ వాసుదేవరావు వివరాల ప్రకారం.. సిద్దిపేట ట్రాఫిక్ సర్కిల్ పరిధిలో పోలీస్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలను నిర్వహించామన్నారు. తాగి వాహనాలను నడుపుతున్న పది మంది పట్టుబడ్డారు. ఈ మేరకు వాహనదారులను సిద్దిపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరు పరిచారు. విచారణ జరిపిన న్యాయమూర్తి రూ. 22 వేల జరిమానా, ఒక్కరికి ఐదు, మరొకరికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ

ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

సిద్దిపేట టౌన్.జనవరి 9 : రోడ్డు భద్రత నియమాలను పాటించడం అందరి బాధ్యత అని సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని సిద్దిపేటలోట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు ప్రధాన చౌరస్తాల్లో పోలీసు సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. డ్రైవ్‌లో పట్టుబడిన వాహన దారులకు బీజేఆర్ చౌరస్తాలో కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం ఏసీపీ సుమన్ కుమార్ మాట్లాడుతూ మానవ తప్పిదాల మూలంగానే అధిక శాతం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై గోపాల్‌రెడ్డి,ఏఎస్సై సదాశివరావు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో చదువుకోవాలి

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

అక్కన్నపేట, జనవరి 9 : విద్యార్థులు లక్ష్యంతో చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని హుస్నాబాద్ సీఐ కొండ్ర శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని గౌరవెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు బాలిక, మహిళ రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, ఈవ్‌టీజింగ్‌పై నూతన చట్టాలు తదితర అంశాల గురించి అవగాహన కల్పించారు. రోడ్డుపై వెళ్లేటప్పుడు ఎవరైనా ఆకతాయిలు దురుసుగా ప్రవర్తిస్తే 100కు ఫిర్యాదు చేయాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్యోతి, ఉపాధ్యాయులు, పీటీఎం బృందం సదయ్య, ప్రశాంతి, కృష్ణ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు సమయం వృథా చేయొద్దు

సిద్దిపేట టౌన్, జనవరి 9 : పరీక్షలు దగ్గర పడ్డాయి.. విద్యార్థులు సమయం వృథా చేయకుండా బాగా చదవాలని సిద్దిపేట వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు మహిళల రక్షణ చట్టాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి,అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో గ్రంథాయాల ఏర్పాటు అభినందనీయం

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

పంపిణీ చేసే పుస్తకాలను చూపిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్, జనవరి 9 : ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థుల కోసం గ్రంథాయాలను టీవైఆర్ ఫౌండేషన్ ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్ అన్నారు. టీవైఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి సందర్భంగా వారు మాట్లాడారు. మారుతున్న పరిస్థితుల్లో సత్తాచాటే విద్యార్థులకు భవిష్యత్ ఉంటుందని, ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేస్తున్న గ్రంథాయాల ద్వారా విద్యతో పాటు పోటీ పరీక్షల్లో సైతం నైపుణ్యత ప్రదర్శించి భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీవైఆర్ ఫౌండేషన్ చైర్మన్ తలకొక్కుల రాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయొద్దీన్, సామాజిక కార్యకర్తలు ప్రభావతి, విజయలక్ష్మి, రోహిత్, రాహుల్, సాదక్‌పాషా శివ సాగర్, ప్రేమ్, హెచ్ఎంలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ప్రదర్శనకు ఎంపిక

జాతీయస్థాయికి ఎంపికైన పోర్టబుల్ మ్యాట్రెస్ క్లీనింగ్ డివైజ్ ప్రదర్శన

గజ్వేల్, జనవరి 9: రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక పర్యావరణ, ఇన్‌స్పైర్ అవార్డుల ప్రదర్శనలో మండల పరిధిలోని అహ్మదీపూర్ పాఠశాల గైడ్ సైన్స్ ఉపాధ్యాయుడు హఫీజ్ సహకారంతో రూపొందించిన విద్యార్థి ఎస్.వికాస్ రూపొందించిన ప్రదర్శన రాష్ట్రస్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎంపికయ్యింది. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో నిర్వహించిన 52వ రాజ్యస్థరియ బాల్ వైజ్ఞానిక ప్రదర్శన 2024-25 ప్రదర్శనలో జిల్లా నుంచి 18 ఇన్‌స్పైర్ ప్రదర్శనలు, 14 సైన్స్‌ఫెయిర్ ప్రదర్శనలు పాల్గొన్నాయి. ఇందులో అహ్మదీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి వికాస్ రూపొందించిన 'పోర్టబుల్ మ్యాట్రెస్ క్లీనింగ్ డివైజ్' ప్రదర్శన ఎంపిక అయ్యింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, కలెక్టర్ విజయేంద్రబోయినీల చేతుల మీదుగా ప్రశంసపత్రం, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి కల్లెపల్లి శ్రీనివాస్, ఎంఈవో కృష్ణ, హెచ్ఎం సుగుణాకర్ అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలకు విరాళం

వీరన్నపేట పాఠశాలకు గేట్‌ను ఏర్పాటు చేసి ప్రారంభించిన మాజీ ఎంపీటీసీ శివశంకర్

చేర్యాల, జనవరి 9 : మండలంలోని వీరన్నపేట ప్రభుత్వ పాఠశాల ప్రధాన ద్వారానికి గేట్ లేకపోవడంతో సమస్యను గుర్తించి మాజీ ఎంపీటీసీ, బీఆర్ఎస్ నాయకుడు ఎలికట్టె శివశంకర్‌గౌడ్ రూ.60 వేల విలువైన గెట్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం కోటగిరి ఎల్లమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ ఎంపీటీసీ మాట్లాడుతూ పాఠశాల ఎంట్రెన్స్‌లో గేట్ లేక పోవడంతో పాఠశాలకు ఎలాంటి రక్షణ లేకుండా పోయిందన్నారు. పశువులు, కుక్కలు తదితర మూగజీవాలు ఇక నుంచి పాఠశాల ఆవరణలోకి ప్రవేశించవని, అసాంఘిక కార్యక్రమాలు జరగవన్నారు. పాఠశాల అభివృద్ధి కోసం గేట్‌ను బహూకరించిన శివశంకర్‌ను పాఠశాల హెచ్ ఎం,ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.కార్యక్రమంలో ఏఏపీసీ చైర్‌పర్సన్ ఆరిగె బాలమణి, ఉపాధ్యాయులు మొ గుల్ల పద్మ,కొంగరి ప్రసాద్, బండ మల్లేశం, చవ్వ రాజయ్య, పెంటపర్తి కొండల్‌రెడ్డి, రాసూరి శ్రీనివాస్, షబానా బేగం, కార్యదర్శి మధుసూదన్, పీఎస్ హెచ్ ఎం జంగిటి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధిక వడ్డీలను నివారించాలని సీపీకి వినతి

చేర్యాల, జనవరి 9 : పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో వడ్డీలకు డబ్బులు తీసుకున్న బాధితులు గురువారం సీపీ అనురాధను కలిసి తమగోడును వెళ్లబోసుకోవడంతో పాటు వినతిపత్రం అందజేశారు. అనంతరం చేర్యాలలో వారు విలేకరులకు వివరాలు వెల్లడించారు. చేర్యాల ప్రాంతంలో పలువురు వ్యక్తులు ఎలాంటి లైసెన్సులు లేకుండా అధికంగా వడ్డీలు వసూలు చేస్తున్నారని, వడ్డీల వ్యాపారం చేస్తున్నారని, చిట్టీలు కొనసాగిస్తున్నారని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలియజేశామన్నారు. వడ్డీలకు డబ్బులు అప్పుగా తీసుకున్న వారిని మనోవేదనకు గురి చేస్తున్నారని, తమను వివిధ రకాలను ఇబ్బందులు పెడుతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. త్వరలో చేర్యాల పరిధిలో వడ్డీల వ్యాపారం చేస్తున్న వ్యక్తులను గుర్తించి వారిపై చర్యలు తీసుకుంటామని సీపీ హామీ ఇచ్చినట్లు తెలిపారు. వడ్డీల వ్యాపారులతో ఇబ్బందులు పడుతున్న వారి తాను అండగా ఉంటానని బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి హామీ ఇచ్చారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో లక్ష డప్పుల ప్రచార రథయాత్ర

లక్ష డప్పుల ప్రచార రథయాత్ర ర్యాలీ

సిద్దిపేట, జనవరి 9 : ఎస్సీ వర్గీకరణ ఏ లక్ష్యంగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వెయ్యి గొంతుకలు, లక్ష డప్పులతో ప్రచార రథయాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. గురువారం సిద్దిపేటలో ప్రచార రథయాత్ర ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ నగర్ కమ్యూనిటీ హాల్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు డప్పులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగ వర్గీకరణ అంశాన్ని గ్రామ గ్రామాన తీసుకెళ్లేందుకు వెయ్యి గొంతుకలు, లక్ష డప్పులతో ఎమ్మార్పీఎస్ పెద్ద కార్యక్రమాన్ని చేపడుతున్నదన్నారు. ఈ కార్యక్రమం నేటి నుంచి సుమారు నెలరోజుల పాటు ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో కొనసాగుతుందని, మాదిగలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. సంఘం నాయకులు శ్రీనివాస్, పర శురాములు, ఇస్తారి, దర్గయ్య, యాదగిరి, పెర్క బాబు, దెబ్బేట చందు గ్రామస్తులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

బహుమతులు అందజేస్తున్న నర్సింగరావు

బెజ్జంకి, జనవరి 9 : మండలంలోని తోటపల్లిలో మాజీ సర్పంచ్ బోయినిపల్లి నర్సింగరావు ఆధ్వర్యంలో గ్రామస్తులకు ముగ్గుల పోటీలు నిర్వహించి,విజేతలకు బహుమతులను అందజేశారు. మాజీ ఎంపీటీసీ లక్ష్మీ, మాజీ ఉపసర్పంచ్ మమత, గ్రామస్తులు పాల్గొన్నారు.

'108'లో ప్రసవం

గజ్వేల్, జనవరి 9 : మండల పరిధిలోని కొల్గూర్ గ్రామానికి చెందిన గర్భిణి రమ్య పురిటినొప్పుతో బాధనపడుతుండడంతో గురువారం ఉదయం 108 వాహనానికి సమాచారం అందించారు. కొల్గూర్ గ్రామానికి చేరుకొని రమ్యను గజ్వేల్ దవాఖానకు తరలిస్తున్న క్రమంలో పురిటినొప్పులు ఎక్కువవడంతో 108 వాహనంలోనే ఆమెకు కాన్పు చేశారు. మగబిడ్డకు జన్మనిచ్చింది. 108 వాహనంలో విధుల్లో ఉన్న ఈఎంటీ రాజు, పైలెట్ మహిపాల్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఫాతిమా షేక్‌కు నివాళి

నివాళులర్పిస్తున్న కార్యదర్శి ఎగొండస్వామి

గజ్వేల్, జనవరి 9 : దేశంలో మొట్ట మొదటి ముస్లిం ఉపాధ్యాయురాలు మాతా ఫాతిమా షేక్ 194వ జయంతి సందర్భంగా సంగాపూర్‌లోని మదర్సా జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి డీబీఎఫ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఎగొండస్వామి మాట్లాడుతూ జ్యోతిరావుపూలే, సావిత్రి బాయి పూలే సహచరురాలు ఫాతిమా షేక్ ప్రతి ఒక్కరికి చదువుకునే అవకాశం కోసం పోరాడిన మహానీయురాలని అన్నారు. హెచ్ఎం డాక్టర్ అదామ్ షేక్, డీబీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయ రికార్డుల పరిశీలన

రికార్డులను పరిశీలిస్తున్న రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్

గజ్వేల్, జనవరి 9 : గ్రంథాలయాన్ని రాష్ట్ర గ్రంథాయల చైర్మన్ రియాజ్ గురువారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయంలోని పుస్తకాల వివరాలను లైబ్రేరియన్ తిరుపతిరెడ్డి ద్వారా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, పుస్తక పఠనాన్ని అలవర్చు కోవాలన్నారు.

సీసీ కెమెరాలు ప్రారంభం

లింగాపూర్‌లో సీసీ కెమెరా